

# పరదేశీ కథలు

## – లలిత చిట్టే



-73 -

## ఎడారిలో వెన్నెల

"**ఏమే నిజం చెప్పు** ఎవడికి పుట్టాడు వీడు. నువ్వేమో నాకే పుట్టాడు అని అబద్ధం చెబుతున్నావు. నేనేమో కాదంటున్నాను. బాగా చూడు వీడిలో కొంచెమైనా నా పోలిక వుందా. వీడిని చూసినప్పుడల్లా నా కడుపు మండుతోంది. పెళ్ళి కాక ముందే ఎవడితోనో తిరిగి కడుపు తెచ్చుకున్నావు. వెంటనే మీ వాళ్ళు నాకిచ్చి కట్టబెట్టారు కదూ. అందుకే వీడు ఎనిమిది నెలలకే పుట్టాడని నాకు అబద్ధం చెబుతున్నావు" గుడ్లురుముతూ ఆవేశంగా మీది కొచ్చాడు భాస్కర్.

కొడతాడేమోననే భయంతో ఒకడుగు వెనక్కి వేసిందామె. ఇక కదలకుండా వెనకనున్న గోడ ఆమెను ఆపింది.

"అసలు నిన్ను కాదే పుట్టిన వీడ్ని పీక పిసికి చంపెయ్యాలి. వీడ్ని చూస్తుంటేనే నా వంటిపై తేళ్ళూ జెర్రులూ పాకుతున్నాయి. వీడు ప్రాణంతో వుండకూడదు. బ్రతకకూడదు" అంటూ నెల బాబును కాళ్ళు పట్టుకుని పైకి ఎత్తి గోడకేసి కొట్టబోయాడు.

అంతవరకూ నిర్వేదంగా నిర్లిప్తతతో అతని మాటలు వింటున్న ఆమె బాబును అతడు తలక్రిందులుగా పట్టుకోవడం చూడగానే వెంటనే సివంగిలా ముందుకు దూకింది.

"బాబును ఏమీ చేయకు నీకు దణ్ణం పెడతాను" అంటూ అతని చేతుల్లోంచి బాబును లాక్కోబోయింది.

ఇంతలోపల కన్నూ మిన్నూ కానని కోపంతో గుక్కపట్టి ఏడ్చే బాబును గోడకేసి విసిరేసాడతడు. పట్టుకోబోయిన ఆమె చేతులను దాటుకుని బాబు శరీరం గోడను తాకింది. కానీ ఆమె చేతులు అడ్డుపడటంతో విసిరిన తీవ్రత కాస్త తగ్గింది అంతే.

క్షణంలో జరిగిపోయింది అంతా. బాబు తల వేలాడేసి చలనం లేకుండా కింద పడిపోయాడు. ఒక్క క్షణం ఏం జరిగిందో అర్థం కాక నిశ్చేష్టురాలైపోయిందామె.

వెంటనే తేరుకుని ఆ పసికందును చేతుల్లోకి తీసుకుని ఏడుస్తూ బయటికి పరిగెత్తింది.

డాక్టర్ దగ్గరికి వెళితే దెబ్బ బలంగా తగిలింది ఏ విషయమూ ఇపుడే చెప్పలేము అన్నారు. ఆమె బిడ్డను వాళ్ళకప్పగించి అక్కడే కూలబడిపోయింది.

మరుసటిరోజే పెదవి విరిచేసారు డాక్టర్లు. ప్రాణం లేని బిడ్డను ఆమె చేతికి అప్పగించారు.

అచేతనంగా వున్న బిడ్డను చూసి బిడ్డ ఇక తిరిగి రాదనీ ఇక లేదని అర్థం కాగానే వెర్రిగా ఒక కేక వేసిందామె. వెంటనే స్పృహ తప్పిందామెకు.

ఉలిక్కిపడి లేచిందామె. గుండె దడదడా కొట్టుకుంటోంది. గొంతు తడారి పోయింది.

ఒక్క నిముషం ఏం జరిగిందో తనెక్కడుందో అర్థం కాలేదు. చీకటిలో కళ్ళు చికిళించి చూసిందామె. గోడకున్న గడియారం లోని మూడు ముల్లులు మిణుకుమంటూ తిరుగుతూ ఆమెను పలకరించాయి. కాస్త వెలుతురు అక్కడినుండి ఆమె మీదకు ప్రసరించినట్లయింది.

కొంచెం ధైర్యం వచ్చిందామెకు. ఆ వెలుగులో తను ఎక్కడ వుందో తెలిసింది.

ఏంటది ఇంతవరకూ తను చూసింది కల? జరిగిన సంఘటనే మరలా మరలా ప్రతిసారీ కలలోకొచ్చి వేధిస్తూ నిద్రకు దూరం చేస్తోంది.

భయంకరమైన ఆ విషయం గుర్తొస్తే గుండెను చేత్తో పట్టుకుని గుక్క పెట్టి ఏడవాలనిపిస్తుంది కానీ గట్టిగా ఏడవడానికి మనిషికి కొన్ని అడ్డు వస్తాయి. కనీసం ఆ స్వేచ్ఛ మనిషికి ఉండాలి కదా.

బిడ్డ గుర్తొచ్చి శబ్దం రాకుండా దుప్పటిని నోటికి అదుముకుని ఏడవసాగింది ఆమె.

ఇది మామూలుగా అపుడపుడూ జరిగే విషయమే. అయినా దు: ఖం ఆగడం లేదు ఆమెకు.

తల పక్కకి తిప్పి ఎడమ వైపుకు చూసింది.

అక్కడ వున్న మంచంపై శ్రీలంక వంట మనిషి గురక తీసి నిద్రపోతోంది. రోజంతా కువైట్ ఇంట్లో పని చేస్తే కలిగే అలసటకు రాత్రికి గుర్రుపెట్టి నిద్ర పోవాల్సిందే.

అలికిడయితే ఎక్కడ లేస్తుందోనని భయపడి మెల్లగా లేచి బాత్ రూం లోకి వెళ్ళి తనివితీరా ఏడ్చి ముఖం కడుక్కుని బయటికి వచ్చింది.

అప్పటికే బయట మసీదులో మౌల్వీ గారు అల్లా హు అక్బర్ అంటూ ప్రార్థనకు పిలుపును మొదలు పెట్టేసారు. తెల్లవారిపోయినట్లే ఇక నిద్రకు బై బై చెప్పాల్సిందే.

ఈ లోపల శ్రీలంకవంట మనిషి ఇంద్రవేణి లేచి పడక మీది దుప్పటి మడత పెడుతూ "ఏం అప్పుడే లేచావు. ఇంకా ఎన్ని రోజులు నిద్రపోకుండా ఏడుస్తూ కూర్చుంటావు. గుండెను రాయి చేసుకోవాలి. బ్రతకాలంటే తప్పదు కదా. ఏడుస్తూ కూర్చుంటే ఏమొస్తుంది అనారోగ్యం అలసట తప్ప" అంది.

ఆమె మాటల్లో జాలి లేదు కోపమూ లేదు. ఒక విధమైన వైరాగ్యం వుంది.

ఏదో తప్పు చేసి దొరికి పోయినట్లు తలవంచుకుని తన మంచాన్ని కూడా సర్దసాగింది ఈమె.

"బాబా మసీదుకు పోయి నమాజు చేసుకుని వచ్చేలోపల నేను ర్యాక్ (అల్పాహారం) తయారు చేస్తాను. నువ్వు ఈ లోపల రెండు కార్లు శుభ్రంగా కడిగెయ్. ఆ కడప డ్రైవరు సెలవులనుండి తిరిగి వచ్చేంతవరకు నీకీ పని తప్పదు" అంటూ గదిలోనుండి మద్వాక్ (వంట గది) లోకి పోయింది.

బకెట్లో సబ్బునీళ్ళు, స్పాంజి, టవళ్ళు తీసుకుని బయట వున్న కార్ల దగ్గరికి పోయిందామె. తలొంచుకుని నిద్ర మత్తుతో కార్లు తుడుస్తుంటే.

పక్కనే వున్న గోడ దగ్గరనుండి 'ఇష్ ఇష్' అని శబ్దం వినిపించింది.

ఎవరా అని అటు చూడగానే పళ్ళికిస్తూ పక్కింటి బెంగాలీ డ్రైవరు ఆమెనే చూస్తూ ఏవో సైగలు చేస్తున్నాడు. గోడ దగ్గరికి రమ్మని పిలుస్తున్నాడు. వాడు నవ్వినప్పుడల్లా నోట్లోని గారపళ్ళు అసహ్యంగా కనిపిస్తున్నాయి. వాడి చూపులు కంపరాన్ని పుట్టిస్తున్నాయి.

వాడిని పట్టించుకోకుండా తలవంచుకుని తన పని తను చేసుకోసాగింది ఈమె.

మగ్గుతో నీళ్ళను చిమ్మినట్లున్నాడు వాడు. నీళ్ళు వచ్చి మీద పడి వెనక భాగమంతా తడిచింది. కోపమొచ్చింది ఆమెకు. చిరాకుగా అటుచూసి అరబ్బీ భాషలో నోటికొచ్చినట్లు తిట్టబోయింది.

ఆమెకు కోపం వస్తుందని వాడికి తెలుసు అందుకే అప్పటికే అక్కడనుండి జారుకున్నాడు వాడు. అలా ప్రతి రోజూ వేధిస్తున్నాడు వాడు.

వాడికంత ధైర్యం ఎలా వచ్చిందో అర్థం కాలేదు ఈమెకు. ఇలాంటి విషయాలు కువైట్ వాళ్ళకి తెలిస్తే కీళ్ళు విరిచేసి విమానమెక్కించి ఇంటికి పంపిస్తారు. తప్పు చేసి దొరికితే శిక్షలు కఠినంగా వుంటాయి. మనలాగా ఊరికే వదలరు వాళ్ళు. అక్కడ తప్పు చెయ్యాలంటే భయం.

అందుకే కువైట్లోని పనిమనుషులు తమ షేకులకు చాలా భయపడతారు. కానీ వీడు గజ్జి కుక్కలాంటి వాడేమో. ఈమెను వదలడం లేదు. ప్రతి రోజూ ఉదయం నిద్ర లేచి బయటికి రాగానే వాడి చేష్టలతో కంపరంగా వుంది ఆమెకు.

ఎవరికైనా తెలిస్తే చెపితే ఏమంటారో తనదే తప్పంటారేమో కువైట్ యజమానులకు తెలిస్తే తననే తప్పుబట్టి తిడతారేమో అనే భయాలు ఆమెను పట్టి పీడిస్తున్నాయి.

కానీ ఆ బెంగాలీ వాడికి అవేమీ పట్టినట్లు లేదు.

ఆ రాత్రి పడుకునే ముందు శ్రీలంక వంటమనిషి ఇంద్రవేణికి తన బాధను చెప్పుకుంది. ఆమె మాటలను వింటూనే పకపకా నవ్వింది ఇంద్రవేణి.

"వాడంతేనే జ్యోతీ. ఏ ఆడది కనబడినా అలాగే చేస్తాడు. నేను కూడా ఒకసారి వాళ్ళ బాబాకు చెబుతానని బెదిరించాను. అప్పటినుండీ నా జోలికి రాడు. రేపు ప్రొద్దున నీతో పాటూ నేను కూడా బయటికి వస్తాలే. చూద్దాం వాడి సంగతి" అని ధైర్యం చెప్పింది ఇంద్రవేణి.

హమ్మయ్య అనుకుంటూ నిశ్చింతగా నిద్రపోయింది జ్యోతి.

నాలుగు రోజులూ జ్యోతికి తోడుగా ఇంద్రవేణి రావడంతో వాడు తోక ముడిచాడు. ఇంతలో సెలవుకు ఇండియా వెళ్ళిన కడప డ్రైవర్ ప్రసాద్ తిరిగి వచ్చాడు.

రావడమే ఇంద్రవేణిని పలకరించి కన్నీళ్ళు పెట్టుకున్నాడు.

"ఏమయింది తమ్ముడూ" అంటూ కలవరపడింది ఇంద్రవేణి.

"ఇద్దరు పిల్లోళ్ళు దిక్కులేని వాళ్ళయినారక్కా నెల క్రితం నేను అక్కడ వుండగానే నా భార్య కరంటు షాకు కొట్టి చనిపోయింది" అంటూ బాధ పడ్డాడు.

"అయ్యో ఎంతపని జరిగింది బాధపడకు తమ్ముడూ ఇదిగో ఈ పిల్ల జ్యోతిని చూడు పెళ్ళయి సంవత్సరం అయిందో లేదో వాడు శాడిస్ట్ మొగుడు పుట్టిన బిడ్డను గోడకేసి కొట్టి చంపేసి జైలుకు పోయినాడు. ఈ పిల్ల అక్కడ వుండలేక కువైట్ వచ్చేసింది. రాత్రయితే చాలు నిద్రపోకుండా బిడ్డను తలచుకుని ఏడుస్తూ కూర్చుంటుంది.

ఏం చేద్దాం చెప్పు. దేవుడు అందరి జీవితాల్లోనూ ఏదో ఒక బాధను పెడుతూ వుంటాడు. బాధను భరించాలి దిగమ్రింగి ముందుకు సాగాలి. నా సంగతే చూడు చిన్న వయసులోనే నా మొగుడు యాక్సిడెంట్లో పోతే బిడ్డలను పోషించుకోవడానికి పక్షిలా ఈ పరదేశానికి వచ్చాను. తప్పదు. ఒకరికొకరం భూమి మీద వున్న వాళ్ళం చేదోడుగా స్నేహంగా వుంటూ బ్రతకును ముందుకు నెట్టాలి" అంటూ ధైర్యం చెప్పింది ఇంద్రవేణి.

ఆమె మాటలు ఎంతో పరిపక్వతను కలిగి ఆప్యాయతను పంచుతూ పోయే ప్రాణాన్ని నిలబెడుతున్నట్లుగ వున్నాయి. ఇతరులకు ధైర్యం చెప్పడానికి అక్కడక్కడా ఇలాంటి మంచి వాళ్ళు కూడా వుంటారు.

ప్రసాదు కూడా ఆమె మాటలకు దు:ఖం నుండి తెప్పరిల్లినట్లే కనిపించాడు.

ప్రసాదు జ్యోతితో అంతగా మాట్లాడేవాడు కాదు. సిగ్గుగా పక్కకు తప్పుకుని వెళ్ళిపోయేవాడు. కానీ భోజనం తీసుకెళ్ళడానికి వంట ఇంట్లోకి వచ్చినప్పుడల్లా ఇంద్రవేణితో కాసేపు కబుర్లు చెప్పేవాడు. భార్యను తలచుకుంటూ ఆమె గురించి చెప్పుకుంటూ ఊరట పొందేవాడు. మధ్యలో కన్నుల్లో చిప్పిల్లే కన్నీళ్ళను తుడుచుకుంటూ ఉండేవాడు ప్రసాద్. భార్య జ్ఞాపకాలనుండి బయటపడలేక పోతున్నాడతను.

అయ్యో ప్రసాదూ పోయిన వాళ్ళు ఇక తిరిగి రారు. నువ్వు కుదుట పడాలి. ఏడుస్తూ కూర్చుంటే ఎలా అనేది ఇంద్రవేణి.

ఒకరోజు అందరూ కూర్చుని కలిసి భోజనం చేస్తున్నారు.

సడన్ గా జ్యోతి వైపు తిరిగి “జ్యోతీ నువ్వు ప్రసాదును పెళ్ళి చేసుకుంటే బావుంటుంది కదా” అడిగేసింది ఇంద్రవేణి.

ఇద్దరూ ఉలిక్కిపడ్డారు. ప్రసాదుకైతే పొలమారింది. నెత్తిన ఒకటి కొట్టి నీళ్ళ గ్లాసు చేతికిచ్చి “అవును మీ ఇద్దరూ పెళ్ళి చేసుకుని కొత్త జీవితాన్ని ఎందుకు మొదలు పెట్టకూడదు?” అని ప్రశ్నించింది ఇంద్రవేణి.

జ్యోతి ఏ జవాబూ చెప్పకుండా తల వంచుకుంది.

“సర్లే నిదానంగా ఆలోచించుకోండి. పెద్దదాన్ని సలహా ఇచ్చాను. ఇద్దరికీ ఈడూ జోడూ బావుంటుంది. తోడూ నీడగా ఒకరికొకరు వుంటే జీవితం ఆనందంగా సాగిపోతుంది అంతే. ఇక మీ జీవితం మీ ఇష్టం” అంది ఇంద్రవేణి నవ్వుతూ.

అప్పటినుండీ ప్రసాద్ ఎదురుపడినప్పుడల్లా జ్యోతికి ఏదో తెలియని ఇబ్బందిగా అనిపించసాగింది. అది సిగ్గో కలవరమో ఆమెకు అర్థం కాలేదు.

ఒకరోజు ఉదయాన్నే బాబా ప్రసాదుకు ఏవో కొన్ని పేపర్స్ తీసుకుని రమ్మని చెప్పి స్నేహితుని ఇంటికి పంపించడంతో కార్లు కడిగే పని జ్యోతి మీద పడింది.

యథావిధిగా తల వంచుకుని కార్లు తుడుస్తుంటే గోడ పక్కనుండి బెంగాలీ వాడు సైగలు చెయ్యడం మొదలు పెట్టాడు. చేతిలోకి నీళ్ళను తీసుకుని ఆమె మీదకు చల్లడం చేస్తున్నాడు. చాలా కోపం వచ్చింది జ్యోతికి. అయినా తమాయించుకుని తన పని తాను చేసుకుపోతోంది.

ఇంతలో ఎప్పుడు వచ్చాడో ప్రసాద్ వాళ్ళింటి గేటు తెరుచుకుని వెళ్ళి బెంగాలి వాడి మీద కలియబడి కొట్టసాగాడు.

వాడు రెచ్చిపోయి “ఏంటీ అదేమన్నా నీపెళ్ళామా నీకెందుకు మా విషయం” అని ప్రశ్నించాడు.

“అవును నా పెళ్ళామే నేను చేసుకోబోతున్నాను. ఆమె జోలికి వస్తే మక్కెలు విరిచేస్తాను” అంటూ గట్టిగా హెచ్చరించాడు ప్రసాద్.

ప్రసాద్ కోపానికీ అతని మాటలకీ ఆశ్చర్యపోయింది జ్యోతి.

ఆ సమయానికి అక్కడ కువైటీ వాళ్లు ఎవరూ లేరు కాబట్టి అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

ప్రసాద్ మాటలు విన్న ఇంద్రవేణి ఇక ఇద్దరినీ ఆట పట్టించడం మొదలయ్యింది. “మీ పెళ్ళి విషయం మొదట నాతో చెప్పకుండా ఆ బెంగాలి వాడికి చెప్తావా ఉండు నీ పని చెప్తా “ అంటూ సరదాగా ప్రసాద్ ని ఏడిపించింది.

“అక్కా మనం అనుకుంటే సరిపోయిందా. మీ మరదలు జ్యోతి కూడా ఒప్పుకోవాలి కదా. నాతో పెళ్ళికి అంగీకరించాలి కదా. ఆమెకు నేను నచ్చానో లేదో” అంటూ బదులు మాట్లాడుతూ ఓరగా జ్యోతి వైపు చూడసాగాడు ప్రసాద్.

“నీకేం తమ్ముడూ నువ్వు బంగారం. నిన్ను చేసుకోవాలంటే ఎవరైనా పెట్టి పుట్టాలి. మనం చెప్పేది చెప్పాము. తరువాత ఆమె ఇష్టం” చూద్దాం అంది ఇంద్రవేణి.

కాలం గడుస్తోంది. ఈ మధ్య కాలంలో జ్యోతి ప్రసాదూ సిగ్గును మరచి కాస్త దగ్గరయ్యారు. బాబా మామా చూడకుండా కాసేపు కబుర్లు చెప్పుకోవడం చేస్తున్నారు. జ్యోతికి చాలా సంతోషంగా వుంది. ‘ఎడారిలాంటి ఆమె హృదయంలో వెన్నెల’ కురిసినట్లుగా అనిపిస్తోంది. ఇద్దరూ ఒకటయినందుకు ఇద్దరికీ తోడు దొరికినందుకు ఇంద్రవేణి సంతోషించింది.

కానీ కాలం ఎప్పుడూ ఒకేలా వుండదు కదా.

ఇంతలో కడుపుతో వున్న మామా కానుపుకని అమ్మగారింటికి పోయింది. ఇంట్లో బాబా పిల్లలు మిగిలారు.

ఇన్నాళ్ళు లేనిది జ్యోతికి ఇప్పుడే నరకయాతన మొదలయ్యింది. బాబా చూపు ఆమె మీద పడి వేధించడం మొదలు పెట్టాడు. కాఫీ టీలు అందించేటప్పుడు చెయ్యి పట్టుకుంటాడు. గదిలోకి రమ్మని బలవంతం చేస్తున్నాడు.

ఇటు ఇంద్రవేణికి, ప్రసాదుకు కూడా విషయం తెలిసి ఏం చెయ్యాలో పాలుపోక గిజగిజ లాడారు.

బాబా చూపులనుండి, చేతలనుండీ తప్పించుకోవడం కుదరని పరిస్థితి. యజమానులు పిలిచినప్పుడు పలకాలి. చెయ్యమన్న పని చెయ్యాలి. తప్పదు.

రోజురోజుకూ బాబా ఆగడాలు శృతి మించి పోతున్నాయి.

ఆ రాత్రి వంట గది శుభ్రం చేస్తుంటే వచ్చి జ్యోతిని గదిలోకి రమ్మని పిలిచాడు. జ్యోతి భయపడి ఏడవడం మొదలు పెట్టింది.

తన గదిలోకి పోయి తలుపు గట్టిగా బిగించుకుంది.

ఇంద్రవేణి అసహాయంగా చూస్తూ నిలబడిపోయింది.

బాబా అలాంటి వాడని తెలుసు కానీ మరీ ఇంట్లోని పని మనుషులను కూడా వేధిస్తాడని ఊహించలేదు ఆమె.

ఆ రాత్రి గడవడం కష్టమయింది.

ప్రొద్దున్నే లేచాక గది దాటి బయటికి రావాలంటేనే భయపడిపోతోంది జ్యోతి.

ఇక ఉపేక్షించలేదు ఇంద్రవేణి.

బాబా చూడకుండా దొంగలా బాబా గదిలోకి వెళ్ళి ఆయన లోపల దాచిపెట్టిన జ్యోతి ప్రసాదుల పాస్పోర్టులు తీసుకుని వచ్చి ప్రసాదును పిలిచింది. ఇద్దరి పాస్పోర్టులూ ఒక నెల జీతం చేతుల్లో పెట్టి "ఇక ఏ మాత్రం ఆలశ్యం చేసినా బాబా చేతిలో జ్యోతి బ్రతుకు నాశనమయిపోతుంది. మీరు వెంటనే ఇక్కడనుండి ఇండియా ఎంబసీకి పారిపొండి. వారికి మీ పరిస్థితిని చెప్పండి. వాళ్లు మిమ్మల్ని ఇండియాకు పంపించేస్తారు. ఇంటికి వెళ్ళి మీరు పెళ్ళి చేసుకుని హాయిగా వుండండి" అంటూ బయటికి పంపేసింది. దేవతలా ఆదుకున్న ఆ శ్రీలంక వంటమనిషికి అశ్రునయనాలతో వీడ్కోలు చెప్పి ఇద్దరూ బాబా కంట పడకుండా టాక్సీ ఎక్కి ఇండియా ఎంబసీని చేరుకున్నారు.

*(మరోకథ వచ్చేనెలలో)*

Post your comments